# స్వయంకృతం

భాస్కరరావు ఆరోజు ప్రమోషన్ మీద సీనియర్ బ్రాంచిమేనేజరుగా పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్నాడు. కొత్త ఊరు - తన స్వంత ఊరికి చాలా దూరం. అయినా అది ప్రమోషన్ కాబట్టి - ఇబ్బంది అయినా - ఆ ప్రమోషన్ను స్వీకరించి ఆ ఊరికి వచ్చాడు. అతను ఒక జాతీయ వాణిజ్య సంస్థలో పనిచేస్తున్నాడు.

అంబాసిడర్ కారులో ఆఫీసు వెతుక్కుంటూ వచ్చాడు. అప్పటికి పదకొండు అయింది. భాస్కరరావుకు క్రమశిక్షణ ప్రాణం! మామూలుగా అయితే ఠంచనుగా పదికే ఆఫీసుకు వస్తాడు.

కానీ, ఆరోజు పదకొండు దాకా దుర్ముహూర్తం వుంది. పైగా మధ్యాహ్నంలోగా పదవీ బాధ్యతలు స్వీకరించవచ్చు. అందుకని ఓ గంట ఆలశ్యంగా వచ్చాడు.

ఆ ఆఫీసు స్టాఫుకు భాస్కరరావు ఎవరో తెలియదు. కాబట్టి అతన్ని గుర్తు పట్టలేదు. ఒక్క చూపులునే ఆఫీసు వాతావరణం పసిగట్టగలిగాడు. అందరూ చాలా నిర్లక్ష్యంగా ఉన్నారు. పని చేసేవాళ్ళు తక్కువ - నటించేవాళ్ళు ఎక్కువ. ఎక్కువమందికి బాతాఖాని చాలా యిష్టంగా వుంది.

కుర్చీలు చాలా ఖాళీగా వున్నాయి. అంటే ఆ స్టాపురాలేదని కాదు అర్థం. వచ్చి ఏ కాఫీకో - టీకో - లేదా ఎవరితోనో హిస్కు కొట్టడానికి వెళ్ళారని గ్రహించాలి.

"మేనేజరు ఎక్కడ వుంటారు." చాలా నిదానంగా అడిగాడు భాస్కరరావు ఎదురుగా కనిపించిన ప్యూనును.

"మీరెవరు?" ప్యూను ఎదురుప్రశ్న వేశాడు.

"నేనెవరైతేనేం - మేనేజర్ని కలవాలి - ఎలా వెళ్ళాలో చెప్పు - చాలు" తీక్షణంగా అన్నాడు.

"ఉహూ! కుదరదండి - ఆయనతో ఏం పనో ఈ అప్పారావుతో చెపితేనేగాని - పర్మిషన్ యివ్వబడదు." ఖచ్చితంగా చెప్పి వేశాడు.

భాస్కరరావుకు అప్పారావు అనగానే భుజం తట్టినట్లయింది. ఎక్కడో పేరు విన్నట్లుంది. ఆ మొహం కూడా ఎక్కడో చూసినట్లుంది. కానీ, అంతకంటే ముందు అతి సమాధానం చిరుకుపుట్టించింది.

"మంచిది - నా దారి నే చూసుకుంటాను." అంటూ ముందుకు నడిచాడు.

కానీ అప్పారావు అతన్ని అడ్డగించాడు.

"ఇది ఆఫీసండి - అడ్డమైన వాళ్ళకి చోటు లేదండి - ముందుగా పర్మిషన్ తీసుకోవాలి.

మీరు బయటుండండి." అప్పారావు చెప్పాడు.

"ఐసీ - ఈ కార్డు చూపించు" ఓ కార్డు తీసి అతనికిచ్చాడు భాస్కరరావు.

అప్పారావు తల విదిరించి దాన్ని పట్టుకుని లోపలికి వెళ్ళాడు.

భాస్కరరావు చుట్టూ చూశాడు - అందరూ తన్ను చూస్తున్నారు. అంతమంది ఉన్నా - అన్నీ కుర్చీలు ఖాళీగా ఉన్నా ఎవరూ కూర్చోమని కూడ చెప్పలేదు. ఇంకా కొందరు తీరిగ్గా ఆఫీసుకు వస్తున్నారు. కాసేపటికి అప్పారావు పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"సారీ సార్! మీరనుకోలేదు - రండి...రండి."

"పర్మిషన్ దొరికిందా?" కరుగ్గా అడిగాడు.

"సారీ సార్ . . . మేనేజరుగారు మీకోసం ఎదురు చూస్తున్నారు." చేతులు కట్టుకుని చెప్పాడు.

భాస్కరరావు పెద్ద పెద్ద అంగలేసుకుంటూ ఛాంబర్‌లోకి వచ్చాడు.

మేనేజరు జాన్‌లేచి నిల్చున్నాడు - చేయి సాచి షేక్ హ్యాండ్ యిచ్చాడు.

"రండి! భాస్కరరావుగారు సుస్వాగతం! ఈ సీట్లో కూర్చోండి - ఈ సీటు మీది" జాన్ చెప్పాడు.

"థ్యాంక్యూ! ఈ రోజు మీరు రిలీవు అవుతున్నారా?" భాస్కరరావు అడిగాడు.

"లీవులో ఉన్నాను. రెండు రోజుల తరువాత రిలీవు అవుతాను. మీకు ఏరియాను పరిచయం చేసి." చెప్పాడు జాన్.

తరువాత స్టాఫును పిలిచి భాస్కరరావును పరిచయం చేశాడు జాన్ - అతనికి ట్రాన్స్‌ఫర్ అయింది. అతని స్థానంలో భాస్కరరావును వేశారు.

చాలామంది గిల్టీగా ఫీలవుతూ భాస్కరరావు ఎదుట నిలబడ్డారు. అప్పారావు అయితే మరీ ముడుచుకుపోయాడు.

జాన్ అందరి గురించి పరిచయం చేసి చివరగా అప్పారావును పరిచయం చేశాడు.

"ఇతను అప్పారావని సీనియరు ప్యూను. పాతికేళ్ళుగా ఈ పోస్టులోనే వున్నాడు." చెప్పాడు.

"నమస్కారం సార్!" చెప్పాడు అప్పారావు.

"అప్పిగా నన్ను గుర్తు పట్టలేదా - నేను కె.బి.రావును." భాస్కరరావు చేయి అందిస్తూ చెప్పాడు.

అప్పారావు షాక్ తిన్నాడు. ఒక్క నిమిషం అప్రతిభుడయ్యాడు. "అంటే... మీరనేది..."

"ఆ...! అవును. తెనాలిలో ఇద్దరం కల్సి పని చేశాం గుర్తుందా?"

"ఒరేయ్ – అప్పుడే ఎంత ఎదిగిపోయావురా? – సారీ...సారీ... చాలా ఎత్తుకు ఎదిగిపోయారు." అప్పారావు తడబడ్డాడు.

భాస్కరరావు అందరికీ స్వీట్లు – కారా – కాఫీ తెప్పించాడు.

ఆ సాయంత్రం బయట గొడవ జరుగుతూంటే బయటికి వచ్చి చూశాడు.

అప్పారావు పూర్తి డోసులో వున్నాడు. ఫుల్‌గా మందు కొట్టేసినట్లున్నాడు. వచ్చిన కష్టమర్లతో గొడవ పడుతున్నాడు. రెచ్చిపోయి మాట్లాడుతున్నాడు. అతని కొలీగ్స్‌ని అతన్ని చెయ్యి పట్టుకుని వెనక్కి లాగుతున్నారు.

భాస్కరరావుకు తలకొట్టేసినంత పనైంది.

"మిస్టర్ జాన్ – ఏమిటీ న్యూసెన్సు?" అడిగాడు.

"ఏం చెప్పమంటారు – ఈ ఆఫీసుకు పట్టిన శని వాడు. వీడి ప్రవర్తన మారుతుందన్న ఉద్దేశ్యంతో ఇక్కడికి వాడి స్వంత ఊరుకు దూరంగా ట్రాన్స్‌ఫర్ చేశారు. వాడ్ని శిక్షించాలని మేనేజిమెంటు ఈ బ్రాంచికి ట్రాన్సుఫర్ చేసింది. కానీ, నిజం చెప్పాలంటే – ఈ ట్రాన్స్‌ఫర్ మూలంగా ఈ బ్రాంచికి శిక్ష పడింది. బాగున్న బ్రాంచి వీడి రాకతో నాశనమైపోయింది. మీకున్న మొదటి ఛాలెంజ్ ఇతనే!" జాన్ చెప్పాడు.

రోజులు – వారాలు– నెలలు గడుస్తున్నాయి.

భాస్కరరావు ఓ సాయంత్రం అప్పారావును పిలిపించాడు పని పడి.

తూలుకుంటూ లోపలికి వచ్చాడు.

"అప్పారావు! ఏమిటది? ఈ వాలకమేంటి? ఈ తాగుడేంటి?" కోపంగా అడిగాడు.

"ఏం – తప్పా? నా డబ్బుతో నేతాగాను." చెప్పాడు.

"డబ్బు ఎవరిదని కాదు ప్రశ్న – తాగడం తప్పు."

"తాగడం తప్పయితే – గొప్ప గొప్పోళ్ళంతా ఎందుకు తాగుతున్నారు చెప్పు?" కైపు నసాళానికి అంటింది.

"చూడు – ఆఫీసు అవర్స్‌లో తాగడం నిషేధించబడింది. తెల్సా – స్టాఫు రెగ్యులేషన్స్ ప్రకారం శిక్షార్హం!" చెప్పాడు భాస్కరరావు.

"ఏం? సస్పెండు చేస్తావా?" ఎగతాళిగా అన్నాడు.

"మాట వినకపోతే – తప్పుకపోతే – సస్పెండు చేయాల్సివస్తుంది." దృఢంగా అన్నాడు – అతనికి కోపం వస్తే వచ్చిందిలేమ్మని.

కానీ, ఉన్నట్టుండి అప్పారావు ఏడ్పు లంఘించుకున్నాడు. బుడి బుడి రాగాలు

తీయడం మొదలెట్టాడు.

"రేయ్! రా వు! నువు చాలా గొప్పోడివైపోయావురా. నువ్వెంత గొప్పోడివైపోయావంటే నన్ను సస్పెండ్ చేసేటంతటి గొప్పోడివైపోయావురా? రేయ్! ఇదేమాట – ఇంకోడు అనుంటే – వాడ్ని తన్ని తగలేసేవాడ్ని! కాని నువ్వు నా ఫ్రెండువి.... నిన్నేం చెయ్యలేను – అదే నా బలహీనత – హు హు!" ఏడ్చేశాడు.

"షటప్! జాగ్రత్త!" కటువుగా చెప్పాడు.

"హూ! నీలాగా నాకూ ప్రమోషన్లు వస్తే నేను తాగేవాడ్ని కాదు – నీలాగా కారుంటే నేను తాగేవాడ్ని కాదు. నీలాగా బంగ్లాలో వుంటే – నేను తాగేవాడ్నికాదు. దేవుడు నాకు అన్యాయం చేశాడు – అందుకే తాగుతున్నాను." అప్పారావు – ఏడుస్తూ ఉంటే – అతన్ని బయటికి పంపించేశాడు.

భాస్కరరావు మనసు కకావికలమైపోయింది. అతనికి గతం గుర్తుకొచ్చింది.

పాతిక సంవత్సరాల క్రిందట తెనాలిలో ఇద్దరు ప్యూనులు ఒకే ఆఫీసులో తమ జీవితాన్ని ప్రారంభించారు – అప్పారావు, కె.బి.రావులు – ఒకేసారి ఆఫీసులో చేరినా వారి ప్రవర్తనలు తేడా వుండేవి.

ఆర్థికంగా బాగా హీనస్థితిలో వున్న కుటుంబంలోంచి వచ్చాడు రావు. ఒక్కమాట చెప్పాలంటే అతను స్కూలు చదివే రోజుల్లో కూలీగా పని చేసి ఫీజు కట్టుకుని చదివాడు.

కానీ, అప్పారావు తండ్రి మంచి ఉద్యోగస్తుడు. అప్పారావుకు చదువు అబ్బకపోవడంతో వాళ్ళ కాళ్ళు వీళ్ళ కాళ్ళు పట్టుకొని అతనికి ఆ ఆఫీసులో ప్యూను ఉద్యోగం యిప్పించాడు తన పలుకుబడితో.

రావు భక్తిగా ఉద్యోగం చేసుకునేవాడు. అందరికి వినయంగా మెలగుతూ – అందరి మాటలు వింటూ అందరి పనులు చేసేవాడు.

కానీ, అప్పారావుకు ఆ పోస్టు తన కెపాసిటీ కంటే తక్కువ పోస్టు అని నామర్దాగా వుండేది.

ఎవరు ఏ పని చెప్పినా అప్పారావు మనస్ఫూర్తిగా చేసేవాడు కాదు. 'వాడా తనకు పని చెప్పేది' అన్నట్లు ఓ ఫోజు విసిరేవాడు. 'నీ అదృష్టం బాగుంది నువ్వు ఆ సీట్లో కూర్చున్నావు – నా ఖర్మకాలి నేనీ ప్యూను పోస్టులో పడ్డాను.' అన్న చూపు ఒకటి విసిరేవాడు.

స్టాఫుకూడ అప్పారావు ఫ్యామిలీ స్థితిగతులు వాళ్ళ ఫాదర్ పలుకుబడి చూసి అతను తమందరికంటే తక్కువ ఉద్యోగస్తుడైనా గౌరవంగానే చూసేవారు. ఏతావాతా అప్పారావు పని భారం కూడా రావు మీద పడేది.

రావు ఏనాడు ఏ పనికీ విసుక్కోలేదు. అతను ఒక్కటే నమ్మాడు. పని దైవం! పనిలో నే ఆనందం! పని శ్రమ కాదు – పనిలోనే మానసిక విశ్రాంతి ఉంది! అలసట

లేదు - అని నమ్మాడు. అతను తన పూర్వపు రోజులలో - తన వంశంలోని కొందరి కూలి పనివారితో - తనను పోల్చుకుని - తాను ఎంతో ఉన్నతంగా ఉన్నట్లు తృప్తి చెందేవాడు.

కానీ, రావు అంతటితో ఆగలేదు. ఆఫీసులోని కుర్రకారును చూసి వారిలో తానుకూడ పై చదువులు చదువుకోవాలని కలలు కన్నాడు. ప్రైవేట్‌గా పరీక్షలు కట్టి రాత్రుళ్ళు కష్టపడి చదివేవాడు. ట్యూషన్‌కు పోయేవాడు. అదృష్టం కొద్దీ పాసయ్యేవాడు.

కానీ, అతను గ్రాడ్యుయేట్ అయ్యేదాకా పెళ్ళి చేసుకోదలచుకోలేదు. అలానే చేసుకోలేదు - అప్పటికే అప్పారావు ఇద్దరు పిల్లల్ని కనేశాడు.

అప్పారావు - అప్పట్లో - అప్పిగా అని పిలిచేవారు - రావు కలిసి ఐదేళ్ళు పని చేశారు. అప్పిగాడు అతనికి పేకాట, జూదం - తాగుడు అలవాటు చేయబోయాడు. కానీ, రావు దురవ్యసనాలకు తన దగ్గర డబ్బు లేదని తప్పించుకుని తిరగేవాడు. అది కత్తిమీద సాములాంటిది.

గ్రాడ్యుయేట్ కాగానే రావుకు క్లర్క్ పోస్టుకు ప్రమోషన్ లభించింది. తెనాలినుండి వైజాగ్‌కు బదిలీ కూడా అయింది.

కానీ, రావు అంతటితో ఆగలేదు. డిపార్టుమెంటు ఎగ్జామ్స్ రాసి పాసయ్యాడు. ప్రైవేట్‌గా యమ్మే పూర్తి చేశాడు.

ఓసారి ఆఫీసరు పోస్టుకు డైరెక్ట్ ఎగ్జామ్ పెడితే ఎంతోమంది మేధావులతో పోటీచేసి - పాసై - ఆఫీసరు కాగలిగాడు.

అంతటితో ఆగకుండా బాగా సిన్సియరుగా పనిచేసిన అటు కింది వారిని పై వారిని మెప్పించి - ఒప్పించి అంచెలంచెలుగా పైకి రాగలిగాడు.

పాతికేళ్ళు సర్వీసు అయ్యే సరికి సీనియరు బ్రాంచి మేనేజరు స్థాయికి రాగలిగాడు - ప్యూనుగా కెరియర్ ప్రారంభించినవాడు.

తన కొలీగ్ యింకా ప్యూను గానే వుండటం - అది కూడా తను పని చేసే బ్రాంచిలోనే వుండటం - ఇంకా అతను దిగజారిపోవడం భాస్కరరావుకు బాధను కలిగించాయి. ఏం చేయాలాని ఆ రాత్రంతా ఆలోచిస్తూ నిద్రపోలేకపోయాడు.

ఓ రోజు ఆదివారం తీరిగ్గా మ్యాగజైన్లు చదువుకుంటున్న భాస్కరరావు దగ్గరికి ఓ నూగు మీసాల యువకుడు ఏడుస్తూ వచ్చాడు.

"సార్! మీరే రక్షించాలి సార్ - మా నాయనకు సీరియస్‌గా ఉంది - చేతిలో పైసా లేదు - " చెప్పాడు అతను.

భాస్కరరావు ఎగాదిగా చూశాడు అతని వంక - ఏవో పోలికలు అస్పష్టంగా.

"చూడు బాబు – ఎవరు నువ్వు – నాతో ఏం పని" – అ డి గా డు.

"అదేసార్ – అప్పారావు కొడుకుని. నాపేరు లక్ష్మీపతి – మా ఫాదర్‌కు చాలా సీరియస్‌గా వుంది. ఆసుపత్రికి తీసుకుపోదామంటే చేతిలో చిల్లి పైసాలేదు సార్ – మీరే రక్షించాలి" ఏడుస్తూ చెప్పాడు.

భాస్కరరావు యింక ఎక్కువ మాట్లాడకుండా కారు తీసి అతన్ని ఎక్కించుకొని అప్పారావు ఇంటికి వెళ్ళాడు.

ఓ రెండు గదుల్లో – యిరుకు యిరుగ్గా అప్పారావు కుటుంబం సర్దుకునుంది. అప్పుడు చూశాడు అప్పారావు శ్వాస ఎగపీలుస్తున్నాడు. బాగా తాగేసినట్లున్నాడు – స్పృహలో ఓలేదు.

అప్పారావు భార్య సావిత్రమ్మ చిరిగిపోయిన చీర – రవికెలో – సిగ్గుతో తలవంచుకుని నిల్చునుంది. అప్పారావు తండ్రి పక్షపాతంతో మంచంమీదున్నాడు. లక్ష్మీపతి కాకుండా – పెళ్ళికి ఎదిగున్న యిద్దరు ఆడపిల్లలున్నారు. అందరూ బిక్కుబిక్కుమంటూ భాస్కరరావు వంక చూస్తున్నారు.

వాళ్ళ సాయంతో అప్పారావును హాస్పిటల్లో చేర్పించాడు.

ఓ రెండు గంటలు – అప్పారావును ట్రీట్‌చేసి బయటికి వచ్చిన డాక్టరును అడిగాడు భాస్కరరావు.

"ఎలా ఉంది సార్ అప్పారావుకు?"

"ప్రస్తుతం ఏమీ చెప్పలేం – మా ప్రయత్నం మేం చేశాం – రాత్రి గడిస్తేగాని – ఏ విషయం చెప్పలేం–బట్ అతని లివర్ బాగా దెబ్బతింది." డాక్టర్ చెప్పాడు.

"ఎంత ఖర్చయినా ఫర్వాలేదు– మంచి ట్రీట్‌మెంట్ యివ్వండి – అతను బ్రతకాలి." చెప్పాడు భాస్కరరావు.

"చూడండి – మేమేం దేవుళ్ళం కాము ప్రాణాలు పోయడానికి. అయినా అతని శరీరంలో ప్రవహించేది నెత్తురుకాదు – సారాయి!" అన్నాడు డాక్టర్.

"మీ ప్రయత్నంలోపం కాకుండా – డబ్బుకు వెనుకాడకుండా – " నసిగాడు భాస్కరరావు.

"చూడండి – మా డ్యూటీ మేం చేస్తాం – కానీ, డిశ్చార్జి అయిన తరువాత మళ్ళీ యిలా ఫుల్‌గా తాగేస్తే అతని బ్రతుక్కి ఎవరూ గ్యారంటీ యివ్వలేరు." డాక్టర్ చెప్పి వెళ్ళిపోయాడు.

అప్పారావు భార్య, పిల్లలు, మంచం దగ్గర మౌనంగా రోదిస్తున్నారు. అప్పారావు ముక్కులో ఆక్సిజన్ గొట్టం ఉంది. నరానికి సెలైన్ ఎక్కిస్తున్నారు.

భాస్కరరావుకు అసహ్యం వేసింది. ఇంతమంది అతని మానాన పడి అలో లక్షణా అంటూ తిండి బట్ట లేకుండా ఏడుస్తూ వుంటే - వచ్చిన జీతమంతా తాగుడుకు తగలేసి అప్పారావు సాధిస్తున్నదేమిటి?

ఎట్లాగయితేనేం అప్పారావు బ్రతికి బట్టకట్టాడు. హాస్పిటల్‌నుండి డిశ్చార్జి కావడానికి ఓ వారం పట్టింది. మందుల ఖర్చు - డాక్టర్ ఖర్చు అంతా భాస్కరరావే భరించాడు మానవతా దృక్పథంతో.

ఆ వారంలో లక్ష్మీపతి - సావిత్రమ్మ కొంచెం దగ్గరయ్యారు. లక్ష్మీపతి తెలివిగలవాడు - తండ్రి చదివించకపోయినా పట్టుదలగా గ్రాడ్యుయేట్ అయ్యాడు. సావిత్రమ్మకు జీవితం మీద విరక్తి చాలా కాలమైంది. అప్పారావుకు చెప్పి చెప్పి చాలయి - పిల్లలను చూసుకుని బ్రతుకు ఈడుస్తున్నది.

లక్ష్మీపతికి ఎలాగైనా ఉద్యోగం యిప్పించమని ప్రాధేయపడింది.

ఓ నాలుగు నెలల తర్వాత చేంబర్‌లోకి కొంత మంది లేడీస్టాఫ్ ఆవేశంగా లోపలికి వచ్చారు.

"మేమేన్నవుండాలి - లేదా అప్పారావన్నా వుండాలి - ఇలాగైతే పని చేయలేం - " మాలతి గట్టిగా అంది.

"ఏంసార్! అప్పారావును అలా వదిలేస్తే మేం ఎలా బ్రతకాలి సార్ - జీవితంలో యింత వరకు ఎవరితోనూ మాటలు పడలేదు - ఈ రోజు వీడితో పడాల్సివస్తున్నది" మల్లిక కోపంగా అంది.

"ప్లీజ్! కూల్ డౌన్ - ఏం జరిగిందో చెప్పండి?" శాంతంగా అడిగాడు భాస్కరరావు.

"తాగొచ్చి నానా రభస చేస్తున్నాడు. లేడీస్ వుంటారన్న జ్ఞానం కూడా లేకుండా నానా బూతులు తిడుతున్నాడు అందరినీ. ముఖ్యంగా మిమ్మల్ని నీచంగా తిడుతున్నాడు. సర్ది చెప్పబోయినవాళ్ళను కొట్టబోతున్నాడు." మాలతి వివరించింది.

మీరు అతనిమీద తక్షణం యాక్షన్ తీసుకోవాలి." మాలతి - మల్లిక డిమాండ్ చేశారు .

"ఆల్‌రైట్! మీరు అతని మీద కంప్లెయింట్ రాసివ్వగలరా? ఇస్తే అతని సంగతి నేను చూస్తాను." అడిగాడు.

"యస్ సార్ - జగిగింది జరిగినట్లు రాసిస్తాం-" చెప్పారు లేడిస్.

"చూడండి - మీరు కంప్లెయింట్ రాసిచ్చే ముందు కొంచెం ఆలోచించుకోండి - రేపు ఎంక్వయిరీ కమిటీ వస్తుంది - అప్పుడు వెనక్కి పోగూడదు - నిజం ఒప్పుకోవాలి - ఓకే!" నిర్ధారించుకోవాడనికి అడిగాడు.

వాళ్ళు ఒప్పుకొని కాగితం మీద పిర్యాదు రాసిచ్చారు. భాస్కరరావు ఇంక ఊరుకోలేదు. ఫోన్ చేసి తనకు మంచి మిత్రుడైన యస్సైని పిలిపించాడు. అలానే ఓ హాస్పిటల్ డాక్టర్ని పిలిపించాడు.

డాక్టర్తో అప్పారావును పరీక్ష చేయించి – తాగినట్లు నిర్ధారించుకొని – రిపోర్టు రాయించుకున్నాడు. ఆ తరువాత యస్సైతో కేసు బుక్ చేయించాడు.

వెంటనే అప్పారావును సస్పెండు చేశాడు.

యూనియన్లు కూడా కిమ్మనకుండా చూస్తూ ఊరుకున్నాయి. అంతకుముందే అతను వారికి నచ్చచెప్పడం వలన.

మరునాడు వలవల ఏడుస్తూ అప్పారావు భాస్కరరావు కాళ్ళు పట్టుకున్నాడు.

"సార్! నా భార్య బిడ్డలు ఏమైపోతారు సార్! నా తండ్రి సార్! వారంతా నా ఒక్క సంపాదనమీదే బ్రతుకుతున్నారు సార్! మీరు నన్ను సస్పెండ్ చేస్తే వారంతా ఉరేసుకుని చావల్సిందేసార్!" విలపించాడు అప్పారావు పలురకాలుగా.

"చూడు అప్పారావు – ఈ సంగతి యిప్పుడు నీకు గుర్తొచ్చిందా? అంతకు ముందు రాలేదా? బాగా తాగేసి అందరినీ అల్లరి పట్టిస్తున్నప్పుడు రాలేదా? వందలొందలు కల్లుపాకలో తగలేస్తున్నప్పుడు రాలేదా? ఆఫీసు డ్యూటీ ఎగ్గొట్టి మందుకొట్టినప్పుడు గుర్తుకు రాలేదా?" భాస్కరరావు తీక్షణంగా అడిగాడు.

"క్షమించండి సార్ – బుద్ధొచ్చింది –" అప్పారావు తలొంచుకుని చెప్పాడు.

"నో – ఈ రోజుకి బుద్ధి వచ్చి వుండచ్చు – కానీ, రేపు మళ్ళీ మామూలే!"

"సార్! నా మొహం కాదు సార్ – మావాళ్ళ మొహం చూసి నన్ను ఈసారికి వదిలేయండి – " ప్రాధేయపడ్డాడు.

"హూ! ఎవరు నీవాళ్ళు! వాళ్ళకి ఏనాడన్నా రెండు పూటలా తిండి పెట్టావా – పండుగకు కాదు – సంవత్సరానికి ఒకసారన్నా ఒక జత బట్టలు కొనిచ్చావా? ఎవరినన్నా సక్రమంగా చదివించావా? మంచాన పడ్డ మీనాన్నకు మంచి వైద్యం చేయించావా? నీ సామాజిక బాధ్యత – కుటుంబ బాధ్యత ఏనాడన్నా నిర్వర్తించావా? తండ్రిగా, భర్తగా, కొడుగ్గా, ప్యూనుగా నీ విధి నిర్వహణ ఏనాడన్నా సక్రమంగా చేశావా?" కోపంగా అడిగాడు అప్పారావు తలదించుకున్నాడు.

"నువ్వెలాగూ సస్పెండ్ అయ్యావు – నాదో చిన్న సలహా – రేపు డిస్మిస్ అయ్యేలోగా తెలివిగా నడుచుకుంటే – భాస్కరరావు చెప్పబోయాడు.

"యూ రాస్కెల్! బాల్య స్నేహితుడివని నీ మటుకు విలవ యిస్తూ వుంటే – మరీ నెత్తికుక్కుతున్నావు" అ ప్పా రా వు కోపంగా అన్నాడు.

"సీ అప్పారావు - అయామ్ మేనేజరు - యు ఆర్ ఎన్‌బార్డినేట్! బీకేర్‌ఫుల్! నువ్వు స్వచ్ఛంద పదవీ విరమణ చేస్తే నీ రిటైరుమెంట్ బెనిఫిట్లు నీకొస్తాయి. అదే డిస్మిస్ అయితే - నీ గ్రాట్యుయిటేరాదు - ప్రావిడెంట్ ఫండ్ రాదు - ఆలోచించుకో - " తాపీగా అన్నాడు.

"దారుణం - ఇంకా మూడేళ్ళ సర్వీసు వుంది - " బలవంతాన ఏడ్పు ఆపుకున్నాడు.

"నీ ఇష్టం - వాలంటరీ రిటైరుమెంట్ అయితే - నీ కొడుకు లక్ష్మీపతి క్లర్క్ జాబ్ యిప్పిస్తాను - నీ బెనిఫిట్లు నీకొస్తాయి - దాంతో అప్పులు తీర్చుకొని పరువు కాపాడుకో - ఆలోచించుకుని చెప్పు-" భాస్కరరావు అప్పారావును బయటకు పంపించేశాడు.

ఓ రెండు నెలల తర్వాత-

"థ్యాంక్స్‌సార్!" లక్ష్మీపతి భాస్కరరావు కాళ్ళమీద పడిపోయాడు. "మీ దయవలన ఉద్యోగంలో చేరగలిగాను."

"చూడు లక్ష్మీపతి - ఉద్యోగంలో చేరినందుకు సంతోషం - స్వయంకృషితో నాలాగా జీవితంలో పైకి వస్తావో - స్వయంకృతంతో మీనాన్నలా అధఃపాతాళానికి పోతావో జాగ్రత్తగా ఆలోచించుకో - " భాస్కరరావు హితోపదేశంగా చెప్పాడు.

తలుపు చాటునున్న సావిత్రమ్మ కళ్లు తుడుచుకుంది - అప్పారావు గొణుక్కుంటూ చెట్టుకింద చతికలపడ్డాడు శూన్యంలోకి చూస్తూ.